క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ లక్ష్మీభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన 13వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పూజా కార్యక్రమాలు, గుడి ఉత్సవం చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచి అర్చనలు చేశారు. 9 గంటలకు మూలమూర్తులకు అర్చకులు స్వర్ణరత్నప్రభ అలంకారం చేశారు. 9–30 గంటలకు ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం తదుపరి భక్తుల చేతుల మీదుగా క్షీరాభిషేకం నిర్వహించారు. 10 గంటల నుంచి మహిళలచే విష్ణు సహస్రనామ పారాయణం, గోవిందనామ సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. 12 గంటలకు భక్తులకు దేవస్థాన కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించిన గుడి ఉత్సవంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

జాగ్రత్తలతో హెచ్‌ఐవీ నివారణ



మాట్లాడుతున్న డాక్టర్ జ్యోత్స్న

మైదుకూరు : ముందు జాగ్రత్తలు పాటించడం ద్వారా హెచ్‌ఐవీని నివారించవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి జ్యోత్స్న అన్నారు. మైదుకూరులో సోమవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం వారు హెచ్‌ఐవీ, సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షితం కాని లైంగిక సంపర్కం, కలుషిత సూదులు, పరీక్షింపబడని రక్తం ఎక్కించుకోవడం ద్వారా హెచ్‌ఐవీకి గురవుతున్నారని తెలిపారు. ఆస్పత్రులలో హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని పేర్కొన్నారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూడవద్దని సూచించారు. ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా అందించే మందులను వాడుతూ హెచ్‌ఐవీ రోగులు జీవితాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసీటీఎస్ కౌన్సిలర్ ప్రసాద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలన అందరి బాధ్యత



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : మత్తు పదార్థాలను నిర్మూలించడం అందరి బాధ్యత అని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన తెలిపారు. డీవైఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ముద్రించిన 'డ్రగ్స్ వద్దు–ఆరోగ్యమే ముద్దు' అనే పోస్టర్లను సోమవారం డీఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని తెలిపారు. ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని యువత దేశభవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి సత్యనారాయణ, డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు, కార్యదర్శులు మేరికుమార్, విశ్వనాథ్, సీఐటీయూ నాయకుడు విజయ్‌కుమార్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు శేఖర్, స్టూడెంట్ నాయకులు శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నల్లేరు పోలమ్మ

కాశినాయన : ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపీపీ నల్లేరుపోలమ్మ, ఎంపీడీఓ మైథిలి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలకొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి కొంత మంది మండల స్థాయి అధికారులు హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు గత మూడు సమావేశాలకు హాజరు కాలేదని, వీరిపై జిల్లా అధికారులకు తెలియజేయాలని ఎంపీపీ ఎంపీడీఓకు తెలిపారు. రాబోయే వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం అన్నిశాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యఆచారి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు సందీప్, పుల్లయ్య, వ్యవసాయాధికారి జయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ సెక్రటరీలు, అధికారులు పాల్గొన్నారు.

సగిలేరు కొల్లబోతోంది..!

- ఆనవాళ్లు కోల్పోతున్న నది
- అడుగడుగునా గోతులే
- అడుగంటిన భూగర్భ జలాలు
- దిక్కుతోచని రైతులు



సగిలేరు నదిలో ఇసుక తోడేయడంతో బయట పడిన సుద్ద పేట్లు



ఇసుక తరలిపోగా దర్శనమిస్తున్న గుండ్రాళ్లు

ఊరు పడుకేసిన వేళ సగిలేరు నదిలోని సహజ సంపద సరిహద్దు దాటుతోంది. అవకాశం దొరికితే చాలన్నట్లు ఇసుక, గలుగు దోపిడీతో నదీమతల్లిగర్భం శోకిస్తోంది. ఒకటా, రెండా, రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లు.. ఒక రోజా రెండు రోజులా.. నాలుగు దశాబ్దాలుగా సగిలేరు కొల్లబోతోంది. నియోజకవర్గ పరిధిలోని చోటామోటా నాయకుల అండ, ప్రభుత్వ అధికారుల అవినీతితో ఇసుక దొంగలు నదిని పాయలు పాయలుగా చీల్చి చెండాడుతున్నారు. దీంతో భౌగోళికంగా సగిలేరు స్వరూపం పూర్తిగా మారిపోయింది.

బద్వేలు : సగిలేరు నదిలో ఇసుక, గలుగు, గుండ్రాలు దోపిడీ వ్యవహారం ఇప్పటికిప్పుడు ప్రారంభమైందేమీ కాదు. గత నాలుగు దశాబ్దాలుగా సగిలేరు నదిలో ఇసుక..గలుగు.. గుండ్రాలు నిర్విరామంగా తోడేస్తున్నారు. కొన్నేళ్లుగా నీటి ప్రవాహం లేకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తున్నారు.

నదిలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సహజ సంపద వ్యవహారం దోపిడీ చేయడానికే పరిమితం కాలేదు. దానివల్ల తాగునీటి, వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలో నల్లమల్ల అడవుల్లో పుట్టిన సగిలేరు నది వైఎస్ ఆర్ జిల్లా కలసపాడు మండలంలో గంగాయిపల్లె దగ్గర ప్రవేశించి.. బద్వేల్ నియోజక వర్గంలో 65 కిలోమీటర్ల మేర 5 మండలాలను కలుస్తూ ప్రవహిస్తోంది. నదిలో అక్కడక్కడా కొండవార ప్రాంతాల్లో దాదాపు 15 కిలోమీటర్లు తప్ప మిగిలిన చోట్ల సగిలేరు గోతులతో నిండిపోయింది. నదిలో నిరంతరం వాహనాల రాకపోకలతో భూమిగట్టిగా మారిపోయి వర్షాలు కురిసి సగిలేరు ప్రవహించినా చుక్క నీరు కూడా భూమి లోపలి పొరల్లో ఇంకే స్వభావాన్ని పూర్తిగా కోల్పోయింది. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి.

నదిలోకి దర్జాగా రాజమార్గాలు

జనం నిద్రపోతున్న వేళ అరాచక శక్తులు నిద్ర లేస్తాయన్నట్లు చీకటి పడిన తరువాత వాగులోకి పోవాలంటే దారులు తెలిసుండాలి. అందుకే ఎక్కడ ఇసుక, రాళ్ల అధిక శాతం ఉంటాయో అక్కడికి పగటిపూట దారులు వేసుకుంటారు. రాత్రి పొద్దుపోయిన తరువాత ఆదారి గుండా సునాయాసంగా ట్రాక్టర్లతో సహజ సంపద ఇసుక, గుండ్రాళ్లు యథేచ్ఛగా తోలుకుంటున్నారు. ఇలా సగిలేరు నదిలోకి వెళ్లేందుకు రెడ్డిపల్లె, ఇ.రామా పురం, ఇ.తంబళ్లపల్లె, సింగరాయపల్లె, పాతరామాపురం, కలసపాడు, సిద్ధమూర్తిపల్లె, కాశినాయన మండలం ఓబులాపురం, ఉప్పలూరు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు మండలం బయనపల్లె, భాకరాపురం తదితర గ్రామాల్లో సగిలేరులో దారులు వేసుకుని ఇసుక తోడేస్తున్నారు. ఇక్కడి నుంచి తరలించిన ఇసుక, రాళ్లు రహస్యంగా డంప్ చేసుకుని డిమాండ్ ఉన్న సమయంలో.. అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. సగిలేరులోని ఇసుక ట్రాక్టర్ రూ.4 వేలు పలుకుతుండగా కంకరకు పనికి వచ్చే గుండ్రాళ్లు రూ.3 వేల వంతున అమ్ముతున్నారు. అలాగే బేస్‌మెంట్లు పూడ్చేందుకు పనికి వచ్చే గలుగు మాత్రం ట్రాక్టరు రూ.2,500 పలుకుతోంది. ఒక ట్రిప్ డీజిల్‌కు రూ.300 లు ఖర్చు అయినా ట్రాక్టర్ ఇసుక నుంచి దాదాపు రూ.3,700 మిగులుతుంది. రోజుకు 5 ట్రాక్టర్లు ఇసుక తోలుకున్నా ఖర్చులు పోను దాదాపు రూ.15 వేలు మిగులుతుందని అంచనా. కలసపాడు మండలం నుంచి బద్వేలు వరకు ఒక్క సగిలేరు నదిలో రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ విలువ చేసే సహజ వనరులు అక్రమార్కులు తరలించుకుపోతున్నారు.

ఎండిపోతున్న బోర్లు

సగిలేరు, కనమేరు, ఎర్రవంక తదితర వాగుల్లో ఇసుక తూమట్టి, గలుగు తరలి పోతుండటంతో వర్షాకాలంలో నీరు భూమి లోపలికి ఇంకే గుణం కోల్పోతుంది. ఫలితంగా భూగర్భ జలం నానాటికీ తరిగిపోతోంది. దీంతో బోరు బావులు ఎండిపోతున్నాయి. గతంలో బద్వేలు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో బోరు బావులు త్వవితే 15 మీటర్ల నుంచి 20 మీటర్ల లోతులో నీరు పడేవి. కానీ ఇప్పుడు 100 మీటర్ల లోతుకు వెళ్లినా తేమ కూడా బయటకు రావడం లేదు."ఫలితంగా సగిలేరులో భూగర్భజలం అడుగంటిపోతోంది. కలసపాడు, కాశినాయన, పోరు మామిళ్ల, బి.కోడూరు, బద్వేలు మండలాల్లో ఒక ఇంటి మటుకు వాడకానికి 500 అడుగుల లోతున బోరు వేసినా కనీసం ఒక ఇంచ్ నీళ్లు పడటం లేదు. దీంతో సరిలేరు నది ఎడారిలా తయారైంది.

అక్రమార్కుల విశ్వరూపం

అక్రమార్కులు ఎవరినీ లెక్కచేయడం లేదు. రాత్రికి రాత్రిళ్లు వందల ట్రాక్టర్లు ఇసుక గలుగు లేపేస్తున్నారు. వీరందరికీ అధికార పక్షం అండదండలు పుష్కలంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. కలసపాడు మండలంలో కొంగళ రామాపురం, రెడ్డిపల్లె, ఇ.తంబళ్లపల్లె, ఇ.రామాపురం పోరుమామిళ్ల మండలంలో రెడ్డికొట్టాల, వంకమర్రి, బి.కోడూరు మండలంలో సిద్దగారిపల్లె, ప్రభలవీడు, తంగేడుపల్లె, గంగిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిపోతోంది. బద్వేలు మండలంలో అయితే చీకటి పడినప్పటి నుంచి తెల్లవారుజాము వరకు సగిలేరులో ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు సందడి చేస్తూనే ఉంటాయి. రోజులో దాదాపుగా 30 నుంచి 40 ట్రాక్టర్లు, టిప్పర్లు నడుస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో సగిలేరు నది పూర్తిగా దాని ప్రాభవాన్ని కోల్పోయింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటే భావితరాలకు నీటిగండం తప్పుతుందని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందుకున్న విద్యార్థులతో సంస్థ వ్యవస్థాపకులు

బి.కోడూరు : మండలంలోని కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న 264 మంది విద్యార్థులకు పోరుమామిళ్ల చిత్తాశౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర గీత, చిత్తాతోమాస్‌రెడ్డి ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో ఉండి చదువుతూ చలికాలంలో ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో ఈ దుప్పట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. సంస్థ వ్యవస్థాపకులకు పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 117 మంది విద్యార్థులకు పోరుమామిళ్ల చిత్తాశౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తాతోమాస్‌రెడ్డి దంపతులు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గతంలో కూడా మండలంతోపాటు జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. సంస్థ ప్రతినిధులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, ఉపాధ్యాయులు దాదాపీర్, వాకాచంద్రశేఖర్, మహేష్ కుమార్, సురేష్‌కుమార్, విజయలక్ష్మి, పరిమళజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నసత్రం వద్ద వ్యాపార గదుల నిర్మాణం

- పనులను అడ్డుకున్న సత్రం ఈఓ
- అక్రమ నిర్మాణదారులపై పోలీసులకు ఫిర్యాదు



సాధు అన్నసత్రం ముందు భాగంలో వ్యాపార గదుల నిర్మాణ పనులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి నివాసం వీధికి వెళ్లే దారిలో సాధు అన్నసత్రం ముందు భాగం ప్రహరీని తొలగించి.. నిర్మిస్తున్న వ్యాపార గదులను స్థానిక ఈఓ బీవీ నరసయ్య అడ్డుకున్నారు. భక్తుల సౌకర్యం కోసం సోమిరెడ్డిపల్లె పొలం సర్వే నంబర్ 333లో 1.46 ఎకరాలు దాతల సహకారంతో దాదాపు 1953లో సత్రం నిర్మించారు. అప్పటి నుంచి బ్రహ్మంగారు సజీవ సమాధి ఆరాధనకు వచ్చే భక్తులకు అన్నదానం చేసేవారు. సత్రం నిర్వహణ బాధ్యతలు మండలంలోని ఓబులరాజుపల్లెకు చెందిన బొమ్ము పెద్దవీరారెడ్డి కుటుంబ సభ్యులు నిర్వహిస్తూ వస్తున్నారు. సత్రం ఏడాదిపాటు ఖాళీగా ఉండకూడదని మొదటిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించారు. మరి కొన్నేళ్ల తరువాత వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల నిర్వహించారు. ప్రస్తుతం వరుణ్ హైస్కూల్ నిర్వహిస్తున్నారు. సత్రంను ఎండోమెంట్ ఆధీనంలోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి సత్రం నిర్వహణ ఎండోమెంట్ ద్వారా నడపుతున్నారు. సత్రానికి ఆదాయం రావాలనే నెపంతో ఎండోమెంట్ అనుమతులు లేకుండా.. బొమ్ము కుటుంబీకులు సత్రం ముందు భాగం రోడ్డు వైపు ఉన్న ప్రహరీని తొలగించి వ్యాపార గదుల కోసం రెండు రోజులుగా నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. విషయం తెలుసుకున్న ఈఓ నిర్మాణాలను అడ్డుకోవడంతోపాటు బి.మఠం పోలీసులుకు ఫిర్యాదు చేయడంతో పనులను నిలుపుదల చేశారు. సమస్యను రూరల్ సీఐ దగ్గరకు ఎండోమెంట్ అధికారులు తీసుకు వెళ్లారు. ప్రస్తుతం నిర్మాణ పనులు ఆపాలని పోలీసులు తెలిపినట్లు తెలిసింది.

నివాసాల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దు



విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో ఆందోళన చేస్తున్న ప్రజలు

ప్రొద్దుటూరు క్రైం : నివాసాల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయొద్దని ప్రజలు నిరసన చేపట్టారు. శ్రీనివాసనగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో ప్రజలు సోమవారం ఆందోళన చేపట్టారు. గతంలో ఇక్కడ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టాలని అధికారులు ప్రయత్నించగా.. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించి అడ్డుకున్నారు. దీంతో అప్పట్లో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను అధికారులు ఆపేశారు. అయితే తిరిగి పనులు ప్రారంభించడంతో ప్రజలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ ఇర్ఫాన్‌బాషా ఆందోళనలో పాల్గొని ప్రజలకు మద్దతు పలికారు. ఇరుకు వీధుల్లో సబ్‌స్టేషన్ ఏర్పాటైతే ప్రజలు నిత్యం భయంతో జీవించాల్సి వస్తుందని ఇర్ఫాన్‌బాషా ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలకు ఏదైనా ప్రమాదం జరిగితే స్థానిక ఎమ్మెల్యేతోపాటు విద్యుత్‌శాఖ అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు ప్రయత్నాన్ని ఉపసంహరించుకోకుంటే విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని శ్రీనివాసనగర్ వాసులు హెచ్చరించారు.

కందుల కొనుగోలు కేంద్రం సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు రూరల్ : ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ప్రభుత్వం కనీస మద్దతు ధరతో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాలు కందులను రూ.7,550తో కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు చేసిన 10 రోజుల్లోనే రైతు బ్యాంకు ఖాతాలకు డబ్బు జమ అవుతుందన్నారు. చిన్న, సన్న కారు రైతులకు కొనుగోలుపై ప్రాధాన్యత ఉంటుందన్నారు. త్వరలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివశంకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ కార్యదర్శి రత్నరాజు, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, చల్లా రాజగోపాల్ యాదవ్, ఈవీ సుధాకర్‌రెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి, నల్లబోతుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బద్వేలు అర్బన్ : మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బద్వేలు అర్బన్ : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు వీరశేఖర్ మాట్లాడుతూ గతంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేసిన సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి కొత్త విధానాలు తీసుకువచ్చి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్, ఏరియా కార్యదర్శి పి.వి.రమణ, పట్టణ కార్యదర్శి నాగేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, డీఈ ప్రభాకర్ దాస్‌కు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు వినతి పత్రం అందించారు. యూనియన్ పట్టణ కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 17 నుండి మార్చి 3వ తేదీ వరకు సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలను చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనులు అప్పగింత నిర్వహణ, సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయనిర్మల, రమేష్, ప్రమీళ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ప్రొద్దుటూరులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు



పోరుమామిళ్లలో ఆందోళన కార్యక్రమంలో అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

ప్రొద్దుటూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచుతామని, గ్రాట్యుటీ అమలు చేస్తామని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, నెలసరి వేతనం రూ.26 వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా అంగన్‌వాడీ వర్కర్ల పట్ల సానుకూలంగా స్పందించడం లేదన్నారు. ఈ ధర్నాకు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరి కుమార్, విశ్వనాథ్, సీఐటీయూ కార్యదర్శి విజయ కుమార్, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాణి, కార్యదర్శి సుబ్బలక్ష్మి, సునీత, నాగలక్ష్మి, రాజీ, సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మైదుకూరులో సీపీఎం అనుబంధ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ ధర్నాకు మద్దతుగా పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా మాజీ కార్యదర్శి ఐఎస్ సుబ్బమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వాలు హామీలు ఇవ్వడం తప్ప కార్యాచరణ లేకపోవడం శోచనీయమన్నారు. 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదని, వేతనాల పెంపుకోరుతూ 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో సీఐటీయూ మైదుకూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు ధనలక్ష్మి, సెక్టార్ నాయకురాలు లక్ష్మీదేవి, సీపీఐ మండల కార్యదర్శి షరీఫ్ పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీల్లో జాప్యం చేయకుండా చర్యలు ప్రారంభించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ నాగేంద్రబాబు, పట్టణ నాయకులు రాయప్ప, సుబ్బరాయుడు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు సుభాషిణి, ప్రధాన కార్యదర్శి హుస్సేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : సుప్రీం కోర్టు తీర్పు మేరకు తమకు కనీస వేతనం అమలు చేయాలని ఐసీడీయస్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ కలిపించాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా చేయాలని, సర్వీసులో చనిపోయిన వారికి అంత్యక్రియలకు రూ. 20 వేలు ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సీనియర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు విజయమ్మ, చిన్నయ్య, మేరీ, జ్యోతెమ్మ, రేణుక, విజయమ్మ, లక్ష్మీదేవి, లావణ్య, రమాదేవి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల అక్రమాలు అరికట్టాలి



తహసీల్దారు రమాకుమారికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

చాపాడు : మండల వ్యాప్తంగా నిత్యావసర సరకుల పంపిణీలో రేషన్ డీలర్లు చేస్తున్న అక్రమాలు అరికట్టాలని కోరుతూ సోమవారం తహసీల్దారు రమాకుమారికి మండల బీజేపీ నేతలు వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మాట్లాడారు. చాపాడు మండల వ్యాప్తంగా రేషన్ డీలర్లు అనేక రకాలుగా అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఎండీఓ వాహనాలు తిరగకుండా అడ్డుకోవడం వల్ల గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారికి రేషన్ సక్రమంగా అందటం లేదన్నారు. డీలర్లు వారి ఇళ్ల వద్దే నిత్యావసర సరుకులు అరకొరగా పంపిణీ చేస్తున్నారని, తూకాల్లో ప్రతి రేషన్ కార్డు మీద 1– 3 కిలోల వరకు తగ్గించి ఇస్తున్నారన్నారు. పేదలకు అందాల్సిన రేషన్ సరకులను డీలర్లు అమ్ముకుంటున్నారన్నారు. ఎండీఓ వాహనాలు గ్రామాలలో రేషన్ పంపిణీ చేయకపోయినప్పటికీ వాటికి సంబంధించిన బిల్లులు మంజూరవుతున్నాయన్నారు. మండల వ్యాప్తంగా రేషన్ పంపిణీపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపి, రేషన్ సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు గురుమహేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బరామిరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, కిసాన్ మోర్చా కార్యదర్శి లక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వీఆర్‌ఓపై చర్యలు తీసుకోండి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ అమృతానగర్ వీఆర్‌ఓ అంటూ, గ్రామ పంచాయతీ సిబ్బందిని అంటూ పేద ప్రజల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్న ఓబులేసు అనే నకిలీ వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అమృతానగర్‌లో ఇళ్ల పట్టాలు కలిగిన లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలంటే ఓబులేసు అనే వ్యక్తి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు మామూళ్లు డిమాండ్ చేస్తున్నారన్నారు. అతను వసూలు చేసే అక్రమ డబ్బులు రెవెన్యూ అధికారులకు, సర్పంచ్‌కు పంపిస్తున్నానని లబ్ధిదారులతో చెబుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా వ్యవహరిస్తున్న ఓబులేసు, అతనికి మద్దతు పలుకుతున్న కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్, పేదల సొమ్మును తీసుకున్న రెవెన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ గంగయ్యకు వారు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్ ములపాకు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గడ్డం నరసింహులు, పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, ఎమ్మార్పీఎస్ మహిళా నాయకురాలు చెన్నమ్మ మాదిగ పాల్గొన్నారు.

సీబీఐటీలో రోబోటిక్, ఐఓటీపై వర్క్‌షాప్



రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఫర్వేజ్ హుస్సేన్

చాపాడు : మండలంలోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం డిప్లమ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు రోబోటిక్, ఐఓటీపై వర్క్‌షాప్ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఐఐ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఫౌండర్ ఫర్వేజ్ హుస్సేన్ పర్యవేక్షణలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోబోటిక్ రోజువారి పనులను చేయగలవని, మైక్రో కంట్రోలర్ బోర్డులో ప్రోగ్రామింగ్ రాసి పనులను చేయించవచ్చన్నారు. రోబోటిక్ ఆర్మ్ ఎలా తయారు చేయాలని విద్యార్థులకు వివరించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మూడు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా మొదటి రోజు రోబోటిక్‌పై విద్యార్థులకు మంచి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం



వధూవరులతో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని ఎంజీ ఆటోనగర్‌లో ఉన్న ఎఫ్‌జీ కల్యాణ మండపంలో అన్నపురెడ్డి వెంకట లక్ష్మయ్య, ప్రసాద్‌రెడ్డి కుమారుడు నరేంద్ర కుమార్‌రెడ్డి, చాపాడు మండలం మొరాయిపల్లెకు చెందిన తిప్పలూరు మహేశ్వరి, జగదీశ్వర్‌రెడ్డి కుమార్తె నందినిల వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరయ్యారు. ఆయన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రొద్దుటూరు రూరల్ : మండల పరిధి హౌసింగ్ బోర్డులోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో సోమవారం సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలానికి మొత్తం 112 యూనిట్లు మంజూరు కాగా 1340 మంది దరఖాస్తుకున్నారన్నారు. ఇందులో 620 మంది సోమవారం ఇంటర్వ్యూకు హాజరు కాగా, వారి సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. మిగిలిన వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న ఇంటర్వ్యూలు

చాపాడు : 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మండలానికి 39 యూనిట్లు మంజూరు కాగా 387 మంది దరఖాస్తు చేసుకున్నట్లు మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ తెలిపారు. వీరందరికీ ఈ నెల 19న ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

బి.కోడూరు : వివిధ కార్పొరేషన్‌లకు సంబంధించి ఈ నెల 19వ తేదీన మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి భాస్కర్‌రావు తెలిపారు.

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలో బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కింద స్వయం ఉపాధి కింద రుణాలు మంజూరు చేసేందుకు 60 యూనిట్లు మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ఇంటర్వ్యూలు

అట్లూరు : రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి యు.భాస్కర్‌బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని నిరుద్యోగులు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు.